# రేపటి పాటలకోసం

ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నకొద్దీ నడవాల్సిన దారి తరుగుతోంది. గమ్యం చేరువవుతోంది..." బ్రతుకు కూడా అంతేకదా! అనుకున్నాడు బ్రహ్మానందం. ఒక్కొక్క యేడాది గడుస్తున్నకొద్దీ జీవితం మృత్యువును సమీపిస్తుంది కాబోలు! అసలు జీవితానికి గమ్యం మృత్యువేనా? వితర్కించుకున్నాడు బ్రహ్మానందం. తాను చదివినంతవరకూ కాదన్నారు కవులు! వేదాంతులు ఉత్తరలోక సాధనమే అంటారు కాబోలు!! ఇంతకీ జీవితానికి గమ్యం ఏదిచెప్మా? వ్యక్తి ప్రయత్నాల సఫలతేనేమో? అబ్బే! అసలెంతమంది వ్యక్తుల ప్రయత్నాలు సఫలీకృత మవుతున్నాయి, ఈ లోకంలో? బ్రతుకు పొడుగునా ప్రయత్నించి, ప్రయత్నించి, ఫలితాలన్నవే ఎరుగకుండా ఎంతమంది కన్ను మూయడంలేదు?... కనుక బ్రతుకు గమ్యం చావుకాకపోతే మరేమిటి? — కృత నిశ్చయుడయ్యాడు బ్రహ్మానందం.

ఇంతకీ వాడెక్కడికి వెడుతున్నాడు ? దేనికోసం ప్రయత్నిస్తున్నాడు? ఎక్కడ్నించి వస్తున్నాడు? ఏమో వాడికే తెలియదు. ఈ ప్రశ్నలన్నిటికి మనకిక్కడే సమాధానాలు దొరికేస్తే కథ ఏముందయినా? వాడెక్కడికి వెడుతున్నాడో, ఎదురైన సమస్యలేమిటో మనకెలా తెలుస్తాయి! తెలుసుకోడానికి మనకిమాత్రం తీరికెక్కడుంది? బ్రహ్మానందానికుండే సమస్యలు వాడికుంటే— మనకుండే యాతనలు మనకీ ఉన్నాయి...

మనలో నలభయ్యేళ్ళు దాటిన వాళ్ళున్నారా — వాళ్ళాడ పిల్లల పెళ్ళిళ్లు చేయాలి; మగపిల్లలకి ఉద్యోగాలు వేయించాలి; చదువులు చెప్పించాలి; పాత యిళ్ళు బాగు చేయించుకోవాలి! అద్దెయిళ్ళ బాధపడలేక ఏదో చిన్నయిల్లు తాటాకుదైతేనేంగాక— స్వంత యిల్లంటూ ఒక ఏర్పరచుకోవాలి! అంతకన్న చిన్నవాళ్ళమైతే— ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లకోసం, జీతంరాళ్ళు ఎలాగూ సరిపోయిచావడంలేదు కనక మరికొంత కిట్టించుకోవడం కోసం, ప్రయత్నించాలి! అంతకన్న చిన్నవాళ్ళమైతే—ఉద్యోగాలు సంపాదించుకోవాలి! ...పెళ్ళిళ్ళు చేసుకోవాలి! తల్లిదండ్రుల్ని సుఖపెట్టాలి!... మరీ చిన్నవాళ్ళమైతే— ఏదోవిధంగా పరీక్షల కొండచిలవల నోళ్ళలోంచి తప్పించుకుని బయటపడాలి!... ఇక ఆడవాళ్ళయితేనా— వాళ్ళ సమస్యల కంతేలేదు!... ఎవరి సమస్యలు

వాళ్ళకుండ నేడున్నాయి. మన సమస్యల నైజమే అలాంటిది! మరోడి సమస్యలగురించి కొంచమైనా తెల్సుకోనీయవు.

బ్రతుకే ఒక గిజిగాడి గూడులాంటిదేమో?... ఆలోచిస్తున్నాడు బ్రహ్మానందం. సాధ్యమైనంత తొందరగానూ నడుస్తున్నాడు. ఆలోచనలు నడకను మందగింపచేయడంలేదు. మరింత ఉద్రేకాన్నే కలిగిస్తున్నాయి. ముందుకు నడుస్తున్నాడు; వెనుక ముందుల గురించి ఆలోచిస్తున్నాడు; జోరు జోరుగా గమనం సాగిస్తున్నాడు.

దారిపక్క ఎప్పుడో అశోకులకాలంలో నాటిన చెట్లు కూడా నడుస్తున్నాయి. అయితే బ్రహ్మానందంలాగ ముందుకు నడవడంలేదు; రైలే తన ప్రయాణ సాధనమైతే ఈచెట్లు మరింత వేగంగా వెనక్కి నడుస్తాయి... "నా మొహానికి రైలు కూడానా!" అనుకున్నాడు. వెనుకవైపునుంచి ప్రయాణీకులతో కిటకిటలాడుతూన్న బస్సు రయ్యిమని దూసుకుపోయింది. చేత్తో ముఖాన్ని చిమ్మేసిన బూడిద దులుపుకొని చూశాడు. బస్సు టాపుకు వెనుకనున్న బద్దీమీద "నర్సీపట్నం" అనే అక్షరాలు కనిపించాయి. అరెరే! అనుకుని నాలుక కర్చుకున్నాడు, "సరేలే ఏంచేస్తాం!" అనుకుని వేగం యింకాస్త హెచ్చించాడు.

అశోక వృక్షాలు చక్కగా చిగిర్చి పూలతో మురిసిపోతున్నాయి. గిరి మల్లెచెట్లు రాసులుగా పూలు కురిపిస్తు

న్నాయి. పురివిప్పి నాట్యం చేస్తున్నాయి!... చెట్లు! వాటి బ్రతుకెంత గొప్పది. మనిషిగా జన్మించేబదులు ఆ చెట్టుగా పుడితే నాకీబాధ లేకపోనుగదా!... అవును చెట్లు చల్లని నీడ నిస్తాయి; చక్కని పూలు పూస్తాయి; తీయని పళ్ళనిస్తాయి. వాటి కొమ్మల్లో అందమైన పక్షులు గూళ్ళు కట్టుకుంటాయి; సేదతీర్చుకుంటాయి; పళ్ళు తింటాయి; 'చెట్ల బ్రతుక్కేం— రాజా బ్రతుకు!... ఎవర్నీ ఆశ్రయించవు; ఎందరికో ఆశ్రయ మిస్తాయి! నిర్ధారణగా అనుకున్నాడు బ్రహ్మానందం.

అవునవును. తొర్రల్లో పాములుకూడా వుంటాయి. కొమ్మల్లో పిట్టలూ— తొర్రల్లో పాములూను? పాములు జ్ఞాపకం రాగానే, మనసెందుకో ఒక్కసారి దడుసుకున్నట్ట యింది వాడికి. ఏదో మసగగా స్ఫురణకు రానారంభించినవి. జ్ఞాపకం తెచ్చుకుందుకు ప్రయత్నించాడు. ఒళ్ళు కంపించినట్ట యింది. జ్ఞాపకాలుకూడా మనిషిని భయపెడతాయి కాబోలు! వెధవ బ్రతుకుల్లే!...

నిన్న సాయంత్రం నాన్న అనేసినతర్వాత ఇల్లు విడిచి పెట్టాడు. తిన్నగా సత్రందగ్గరకు వచ్చాడు. ఏం తిన్నాడో, ఏంచేశాడో— గుక్కెడు మంచినీళ్ళుమాత్రం తాగాడు. చాపమీద పడుకున్నాడు. బయట వర్షంకోసం మబ్బులు తంటాలు పడుతున్నాయి. ఉరుముతున్నాయి గుండెల్ని చీల్చే

ట్టుగా మెరుస్తున్నాయి. కాని తనకి బాగానే నిద్రపట్టేసింది. ఎంతనిద్ర పట్టిందంటే ఆ భయంకరమైన కలలో గట్టిగా గావు కేకలు వేస్తూంటే ప్రక్కన పడుకున్న పెద్దమనిషి తట్టిలేపితేనే గాని తనకి మెలకువేలేదు. ఎంత భయంకరమైన కలవచ్చింది ? స్పష్టంగా జ్ఞాపకం చేసుకున్నాడు బ్రహ్మానందం. ఈమాటు అడుగులు కొంచెం మందకొడిగా పడుతున్నాయ్. కలమాత్రం నిజంగా గబగబ కళ్ళలో తిరిగిపోతోంది.

తనూ వాళ్ళ చినమామయ్య కూతురు సుమిత్రా తోటలోకి వెళ్ళారు. సీమచింత చెట్టుమీద దోరముగ్గిన గుటకలు వ్రేల్లాడుతున్నాయి. "ఒరే బావా! సీమచింత కాయలు కోయరా, తిందాము!" అంది సుమిత్ర... నిజమే! చెట్టు ఎక్కవలసినవాడూ, కోయవలసినవాడూ తనే మరి! సుమిత్ర క్రిందనుంచి ఏరాలి. అన్నీ పోగుచేసి, తొక్క లొలిచి గింజ లేరిపారేసి తనకి పెట్టాలి. కనుక నే గబగబ చెట్టెక్కాడు. ఇలాఇలా ఎక్కాడో లేదో కొమ్మల్లో వ్రేలాడుతూన్న పెద్ద సర్పం బుసకొడుతూ లేచింది. తనమీదికి ఉరుముకుంటూ వస్తోంది. గత్యంతరంలేక కొమ్మపట్టు వదిలేసి క్రిందికి దభీమని పడ్డాడు. పడేటప్పుడు ఎక్కడపడింది తెలియదు. క్రింద ముళ్ళ తొప్పలమీద పడ్డాడు. ఒళ్ళంతా సలప నారంభించింది. సమిత్ర లేవదీయడానికి వస్తుంటే పాము దిగివచ్చి ఆమెని కాటేసింది. తన్నుకుంటూ పడిపోయింది; తన సుమిత్ర తనకి

లేకుండా పోయింది. ముళ్ళబాధతో తాను విలవిల తన్నుకుంటు న్నాడు. గట్టిగా కేకలు వేస్తున్నాడు...

ఎవరో లేపేశారు. ప్రక్కలికి వత్తిగిలి ఉద్వేగంగా లేచి కూర్చున్నాడు. చుట్టూ చూసుకున్నాడు. సీమచింతచెట్టు లేదు; సుమిత్రలేదు; పాముకూడా లేదు. తనుమాత్రం సత్రం అరుగుమీద తుంగచాపమీదే ఉన్నాడు. మూడు బారల దూరంలో ఎవరో మగవాడు గుర్రుపెడుతున్నాడు. పిల్లులు దెబ్బలాడుకుంటున్నట్లుగా వుంది. మరికొంచం దూరంలో ఎవరో ఆడది కడియాలు చప్పుడు చేసింది. గాజులు మ్రోగే ట్లుగా గొణుక్కుంటోంది.

'ఎంత పాడుకల వచ్చిందీ?' అనుకున్నాడు బ్రహ్మానందం మళ్ళీ నిద్రపోవడానికి ప్రయత్నించాడు. ఎంతసేపటికో గాని నిద్రపట్టలేదు. తెల్లవారగట్లే లేచి బయల్దేరాడు అప్పుడే ఆరు మైళ్ళు వచ్చేశాడు. 'ఇంకో ఆరు మైళ్ళేకదా!' అనుకున్నాడు.

'చెట్టు తొర్రల్లో పాములుంటాయి. మనిషి తొర్రలో కూడా పాములుంటాయా?'-ప్రశ్నించుకున్నాడు బ్రహ్మానందం "ఆఁ...వుండకేం?...మనిషి బుర్రే అతనికి తొర్ర...విషపు ఆలోచనలే పాములు!...బాగుంది, బాగుంది!...కొంచం గట్టి గానే అనుకున్నాడీమాట. ఎక్కడ్నించి వచ్చిందో చిన్ననవ్వు కూడా మొలిచింది. వుడు వెంటనే మటు మాయమైంది. దుఃఖం

ఉక్కిరి బిక్కిరి చేసినట్టుగా ముఖం తేలిపోతోంది. ఆలోచనల వేగంలో దూసుకు పోతోంది మనస్సు!

నాన్న!... ఎంతపని చేశాడు నాన్న ... ఎంతమాట అనేశాడు. దురదృష్ట వశాత్తూ ఇంటర్ పరీక్ష తాను మూడు సార్లు తప్పితే మటుకేం? తాను పోతులాగున్నాడా? ఇష్టంలేక పోతే ఇష్టంలేని మాటలనడంగాని: చదవడానికి స్తోమిత మేడి స్తేగా!...తనకి బాగుపడే యోగమేవుంటే తనతల్లే బ్రతుకును ...ఎంత సవతి తల్లి అయితే మాత్రం—అంత రాక్షసంగా తయారవాలేమిటి? భూమాతలాగ ఎంతో సహనం వహించే సవతితల్లులు లేరూ? పాపం మాటలెందుకు? ఈ కొత్తమ్మ మాత్రం మొదట్లో ఎంత సౌమ్యంగా వుండేది!

తనకి ఏడేళ్ళు వెళ్ళాయి. చెల్లాయి మీనాక్షికి నాలుగో యేడు. అమ్మకి జబ్బుచేసింది. క్షయదగ్గో యేదో అనేవారంతాను. చెల్లినీ తననీ బామ్మ తనదగ్గరే పడుకోబెట్టు కునేది. ఆఖరికి అమ్మ ఒకనాటి సాయంత్రం చనిపోయింది... "రాజ్యలక్ష్మి నిజంగా లక్ష్మీదేవేరా నాయనా? మనింటి అదృష్టదేవతే పోయిందిరా..." అంటూ జ్ఞాపకం వచ్చినప్పు డల్లా యేడ్చేది బామ్మ. మరో యేడాది తిరిగేసరికి నాన్నకి పెళ్ళయింది...

'మాయిద్దరికీ కొత్తబట్టలు కుట్టించాడునాన్న. పెళ్ళి

ఎల్లుండనగా మమ్మల్నిద్దరినీ తొడలమీద కూర్చోపెట్టుకుని కుమిలి కుమిలి—ఏడ్చాడు నాన్న! బామ్మ దెబ్బలాడింది—అదేమిటిరా! పిల్లలుబిక్క— చచ్చిపోరూ!...శుభమా అంటూ ఆకన్నీళ్ళేమిటిరా, నాయనా?" అంటూను. అభమూ శుభమూ తెలియని వయస్సు మాది. మానాన్న పెళ్ళికి తోరణాలు కడుతుంటే ఎంతని గెంతులేశాము! ఎంత సంబరపడ్డాము. అప్పట్లో మాకేం తెలుసు? నాన్నకి పెళ్ళినాడు, మాయిద్దరినీ ఒక గదిలోపెట్టి నిద్రగొట్టేశారు. మేము మానాన్నపెళ్ళి చూడకోడదట!

"మాకొత్తమ్మ కాపురానికి వచ్చిన మొదట్లో మమ్మల్ని గారాంగానే చూసేది. రోజూ నీళ్ళుపోసేది తలలు దువ్వేది. ఎంతో యిదిగా చూసేది. ఐదారేళ్ళు చాలాసంతోషంగా ఏలోటూ లేకుండానే గడిచిపోయింది. అసలు మా అమ్మ చచ్చిపోయిందన్న సంగతే మాకు తెలిసేది కాదు!...

"ఇంతట్లోకే మా కొత్తమ్మకి కడుపువచ్చింది. ఆడపిల్లపుట్టి ఏడు రోజులే(బతికి, చచ్చిపోయింది. పురిటిలో వుండగానే వెర్రికేకలు వేయడం. అందర్నీ తిట్టడం—పిచ్చెత్తినట్లే తయారయింది. అంతే! ఆరోజు మొదలుకొని మా జీవితాలే నరకమయ్యాయి నన్నూ చెల్లి మీనాక్షినీ ఎన్నిసార్లు కొట్టింది! ఎప్పుడూ తిడుతూనే వుండేది. తనయింట్లో మేమేదో తలబరువుగా తయారైనట్లు! మానాన్న క్రమంగా మా కొ

త్తమ్మకి దాసుడై పోయాడు. ఇంటిడి చాకిరి మా బామ్మగారే కదా! మంచం దిగేది కాదు. మా ఇద్దరికి ముసిలావిడ తలంటి పోస్తుంటే కుంకుడుకాయ పులుసైనా పోసేదికాదు; ఇంతపనీ చేస్తూంటే, అత్తగారు కదా అని వీసమెత్తు గౌరవమైనా లేకుండా నానాతిట్లూ తిట్టేది కొత్తమ్మ. ఉత్తపుణ్యానికే మామీద విసుచుకుపడేవాడు నాన్న!...ఇల్లు శాంతి సౌఖ్యాలకే దూరమై పోయింది.

"రెండు మూడేండ్లనుంచి మరీ రాక్షసంగా తయారైంది. ఇదివరకింతచేటు లేదు; పట్టూ విడుపూ ఉండేవి... ఎన్నాళ్ళని భరించగలం? నిన్న సాయంత్రం బజారుకు వెడుతూంటే— తనకి చేమంతిపూవులు తెమ్మని డబ్బులిచ్చింది. బజార్లో ఎక్కడా చేమంతులు లేవు. కనకాంబరాలు జాజి పూవులూ తెచ్చాను. అరటి ఆకుతో కట్టిన పొట్లం ఘుమ ఘుమలాడిపోతోంది. ఇంటికి తెచ్చి కొత్తమ్మ చేతిలో పొట్లం పెడుతూ, "బజార్లో ఎక్కడా చేమంతులు లేవు!" అనిచెప్పాను. జాజిపూవుల కేమొచ్చింది! ... పొట్లంవిప్పివాసన చూసింది అంతే!

"అప్పటివరకూ ఆమె ముఖంనవ్వుతూనేవుంది. పువ్వులు పెట్టుకోవడం తప్పిస్తే మిగిలిన అలంకారాలన్నీ పూర్తిచేసుకొంది. అందంగా ఎంతో ఉత్సాహంగా వుంది. జాజిపూవులు వాసన చూసేసరికి ఆమె కేమిటో మనసు పట్టుతప్పింది. ముక్కు

లోంచీ నోట్లోంచీ శ్వాసలెగతన్నుతూ, పడగెత్తిన త్రాచులా తయ్యారైంది. పూలపొట్లాం నాముఖానికేసి కొట్టింది .." బుద్ధిలేదట్రా నీకు; అన్నం తింటున్నావా? గడ్డా జాజిపూవులు నాకు పడవని నీకు తెలీదూ? ఛీ పసువా?" అంటూ ఇంటి పెణక ఎగిరిపొయ్యేట్టు అరవనారంభించింది. పెరట్లో పచ్చడి రుబ్బుకుంటూన్న బామ్మ, చేతులైనా కడుక్కోకుండా వచ్చి. నోరు వెళ్ళబెట్టి చూస్తూ నిలబడి పోయింది. చెల్లెలు మీనాక్షి జడవేసుకుంటూ అలాగే ఆగిపోయింది.

'కొత్తమ్మ నన్నింకా నానాతిట్లు తిడుతూనే వుంది. నాకు పౌరుషం ఆగలేదు. పంథొమ్మిదేళ్ళు పై బడ్డనన్ను చంటి వెధవని తిట్టినట్టు తిట్టడం సహించడమెల్లా? "జాజిపూవులంటే నీకు కోపమని నాకేం తెలుసు కొత్తమ్మా!" అన్నాను.

"చూశావా! చూశావా!" అంటూ మీద పడబోయింది. "జాజి పూవులంటే నాకు భయమేట్రా! ఎంత మాటన్నాడో చూశారా? వీడినోరు పడిపోనూ?" అంటూ అలా విరుచుకుని, మంచంమీద పడిపోయింది. ఒక్కటే శోకాలు ప్రారంభించింది. దీర్ఘాలుతీస్తూ తిడుతూనేవుంది. ఏడ్పులు పెడబొబ్బలతో యిల్లు తుఫానులో కొట్టుకు పోతున్నట్లయింది.

"ఇంతట్లోకే నాన్న స్కూలునుంచి వచ్చాడు. ఇంట్లో అడుగు పెట్టేసరికే యిల్లు యిలా అంటుకుపోతోంది. ఒకక్షణం

విన్నాడో లేదో, నామీద నాన్న కూడా ఉరమనారంభించాడు “వెధవా! మీ అమ్మ వద్దన్నవి ఎందుకు తేవాలిరా?” అని మొదలుపెట్టాడు. ఎన్ని మాటలన్నాడో చెప్పలేను. నేను నెమ్మదిగా జవాబు చెబుతూనే వున్నాను. బామ్మకూడా చెబుతోంది. చెల్లాయికూడా మెల్లిగా గొణుగుతూనే వుంది. నాన్న వినిపించుకోవడమే లేదు.

“నాతో జాజి పూవులు తేనద్దని కొత్తమ్మ చెప్పలేదు నాన్నా ఎందుకలా తిడతారు?” అన్నాను.

‘నాన్న మండిపడ్డాడు. ఇంతకన్న ఏమీ కారణంలేదు. ధూమ్రాక్షుడిలాగై పోయాడు. కోపం మరోదానిమీదా, పగ నా మీదాను. ప్రాణం ఉసూరుమని పోయింది; ఛీ వెధవ బ్రతుకు—చస్తే నయం! ’అనిపించించింది. తెగించి అనేశాను.

“కొత్తమ్మకి జాజిపూవులంటే కోపం అని నాకేం తెల్సు!” అంతే; నాన్న ప్రళయరుద్రుడై పోయాడు; “ఛీ... వెధవా నోర్ముయ్...పోతులా తిని తిరుగుతూ ... పరీక్షలేనా ప్యాసవలేని వెధవ్వి... ఇంట్లో ఏపనీ సరిగా చేయలేని వెధవ్వి ...ఎందుకు నువ్వుండి. ఫో...అవతలికి. నీలాటి అప్రయోజకుల్ని మేపడానికి తేరగా రావడం లేదిక్కడి కేమీ!...యింకా పోవేం?” అంటూ చిందులు త్రొక్కాడు. కన్నీళ్ళతో అలాగే నించున్నాను. నేనేమీ ఎదిరించలేదు ... “ఏడుపు గూడా

ఎందుకు...వెధవ పౌరుషం!" అంటూ మెడమీద చెయ్యేసి బైటకు గెంటేశాడు నాన్న!

తాను మళ్ళీ యింటికేసి చూడలేదు. బొమ్మ చెల్లాయి ఒకటేగోల. చివరిసారి బొమ్మని చూసినప్పుడామె కన్నీళ్ళు ధారగా కుమ్మరిస్తోంది...కాని తాను సర్వసంగ పరిత్యాగిలా కేవలం సిద్ధార్ధునిలాగ—మళ్ళీ వెనక్కి తిరగలేదు. అదే ప్రయాణం సాగించాడు.

"ఇంతకీ జాజిపూవులంటే కొత్తమ్మకి ఎందుకంత కోపం వచ్చింది చెప్మా?" అనుకున్నాడు. నల్లగా దృఢంగావున్న ఆసామీ ఎవరో ఎదురుగావచ్చి తనదగ్గరసా ఆగాడు. "ఏం బాబూ— పుల్ల ఎద్దుల్ని తోలుకెడుతూన్న ముసలాడు, ఎంత దూరం ఎల్లుంటాడు బాబూ!" అన్నాడు. బ్రహ్మానందం ఏమీ ఆలోచించలేదు. వెంటనే సమాధానం చెప్పేశాడు; "పుల్ల ఎద్దుల్ని చూపలేదు." తియ్యాటెద్దుల్ని చూడలేదు అలా తన మాటమీద వేళాకోళంచేయడంతో ఆసామీకి మండెక్కింది. పోనీలే బాబూ; అంతకోపం ఎందుకయ్యా!' అన్నాడు.

తానేమీ మాట్లాలేదు. నడుస్తున్నాడు. జనం అడపా తడపా ప్రయాణం చేస్తూనే వున్నారు. అనేక వాహనాలు శక్తినంతా పూనించి నడుస్తూనే వున్నాయి. తనకి మాత్రం ఎవరూ తోడు రావడం లేదు. ఎవరితోనూకలసి తాను నడవడం లేదు. ఎవరితోనూ కలసి మాట్లాడ్డంలేదు.

గమనంలోనూ, చలనంలోనూ ఏమహాత్మ్యముందో గాని—ఆలోచనలు పాదరసంలా దొర్లిపోతాయి. జ్ఞాపకాలు అనంతంగా తీగలు సాగిపోతాయి.

అబ్బో! ఏణ్ణర్థంపైనే అయింది. వేసంగి శెలవలకి తను చిన్న మామయ్యగారింటికి వెళ్ళాడు, ఆ యేడు తను యింటర్ పరీక్షకీ, సుమిత్రి స్కూల్ ఫైనల్ పరీక్షకీ వెళ్ళాడు. ఇద్దరు బాగానే వ్రాశామనీ, యిద్దరూ తప్పక ప్యాసవుతామనీ, అంచనాలు వేసుకున్నారు; ఆశించారు.

ప్రతిరోజూ పంతాలు వేసుకోని. మామిడిపళ్ళూ పనస తొనలూ తినడం. సాయంత్రం మళ్ళీ స్నానాలు చేసి ఆరు బైట కూర్చుని సుమిత్రి మల్లెమొగ్గలు దండలు గుచ్చు తుంటూంటే—కబుర్లు చెప్పుకోవడం—ఇదీ కార్యక్రమం. ఒకొక్కనాడు చినమామయ్య తాటి ముంజెలు, బుర్రిటెంకలు తెప్పించేవాడు. తనూ పిల్లిద్దరితోనూ కూర్చుని ఏవో కబుర్లు చెబుతూ వుండేవాడు. అలాంటి సమయాల్లో చిన్నత్త వచ్చి ఏదో పరిహాసం చేస్తూ వుండేది. వాళ్ళిద్దరూ మాంచి సరదాగా ఎప్పుడూ ఆనందంగా వుండేవారు. వాళ్ళెప్పుడూ కస్సుబుస్సు మనుకోవడం, ఎవ్వరూ వినలేదు. అతను చెబుతూవుండేవాడు; తాను ఫిఫ్తుఫారం చదివి మానేసాడట. ఒక కంట్రాక్టర్ దగ్గర పదిహేను రూపాయలకి ప్రవేశించాడట; అలాంటిది, కేవలం అత్త వచ్చిన వేళావిశేషంవల్లో, తన జాతక ఫలితం వల్లో

అదృష్టం కలిసివచ్చి తానే ఒక కంట్రాక్టరయ్యాడు. ఎనిమిదె కరాల భూమికొనుక్కున్నాడు;అందమైన యిల్లు కట్టుకున్నాడు నర్సీపట్నంలోనే స్థిర పడ్డాడు. ఒక సుమిత్ర తప్ప వేరే సంతానంలేదు; చీకూ చింతా లేదు; హాయిగా కాలం గడుపు తున్నాడు చిన మామయ్య!

"అదృష్టం ఉంటే సరి—ఎంతటివాళ్ళు ఎంతటి వాళ్ళ వుతారులే!" అనుకున్నాడు బ్రహ్మానందం.

తనకి బాగా జ్ఞాపకం వుంది. ఆనాడు ఏప్రిల్ ఇరవై నాలుగో తేదీ. ఉదయం తొమ్మిదిన్నర అవుతుంది. సుమిత్ర తలంటు పోసుకుంది. బావంచాలు, కర్పూరాలు వంటిసుగంధ ద్రవ్యాలు వేసి సున్నిపిండి విసిరిస్తుందత్త. దాంతో ఒళ్ళు నల్చుకొని, సీకాయపొడుంతో తల రుద్దుకొందేమో—సుమిత్ర ఘుమఘుమలాడిపోతోంది. లేతనీలం వాయిలుచీర కట్టుకుంది. తూర్పు వసారాలో మడత కుర్చీమీద కూర్చుంది. లేత యెండలు ఏటవాలుగా పడుతున్నాయి. ఆమెనల్లని శిరోజా లను మెరిపిస్తున్నాయి. తలకట్టు చిక్కు తీసుకుంటూ లోగొం తులో సన్నగా పాడుకుంటోంది.

ప్రొద్దునే మామయ్య తన ఇంజనీరు గారింటికి వెళ్ళి సువర్ణరేఖ మామిడిపళ్ళిచ్చి రమ్మన్నాడు. వారిల్లు కొంచెం దూరమే! సైకిలు మీాద వెళ్ళి తానప్పుడే వచ్చాడు. వస్తూనే

యింట్లో నాలుగు మూలలలా చూసి, తూర్పు వసారాలోకి వెళ్ళాడు. అలసి వచ్చిన తన కళ్ళకి సుమిత్ర నిజంగా అమృత భాండంలాగే వుంది. అంచాతనే అన్నాడుకూడా.

"అబ్బా...సుమిత్రా!—ఆలేత నీలం వాయిల్ చీరలో నువ్వు—కురులు సవరించుకుంటూంటే—నిజంగా అప్సరసలాగే వున్నావు సుమా!" అని.

"పో...బావా!...అన్నీ దొంగమాటలేనీవి..."

"అబ్బెబ్బే నిజం సుమిత్రా! నీప్రక్కన కూర్చున్న కోతికూడా, నీ సౌందర్యం కాంతికి దేవతలా మెరిసిపోతుంది, తెలుసా?" అన్నాడు, చాలా ఠీవిగా, ప్రవక్త ధోరణిలో!

"ఓహో.. అదా సంగతి అంచేతనా? ఎవరో దేవత ప్రత్యక్షమైందను కున్నాను" అన్నది సుమిత్ర. కోలగా చూపులు సారించి వింతకాంతులు కురిపించింది. ఆదెబ్బకు ఒక పట్టాన తట్టుకోలేకపోయాడు తాను. విషయం మారుస్తున్నట్టు నటించాడు.

" ఏదీ నీచిక్కు- నేను తీస్తానిలా యియ్యి దువ్వెన! " అంటూ బలవంతంగా పుచ్చుకున్నాడు.

"అబ్బా... ఉండూ... ఎవరేనా చూస్తే ఏమనుకుంటారు?" అంది సుమిత్ర.

"ఏం...ఏమనుకుంటారేం... ఆడారక్కయ్యలా తల దువ్వుతున్నాడు—అంటారు. అంతేనా?" అన్నాడు.

వెనుకనుంచి ఆమెను దగ్గరగా లాక్కొని ఒక్క ముద్దు పెట్టుకున్నాడు.

"అబ్బో! అబ్బాయిగారి పని చాలావరకూ వచ్చిందే!" అంటూ ముక్కు పట్టుకు లాగింది. చిరునవ్వు నవ్వింది.

"అబ్బే...ఎంతవరకూ రాలేదు...ప్రత్యక్షమైన దేవత వరమియ్యాలిగా మరి!"

ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు. కువకువలాడుతున్న గోరువంకలు ఒక దాన్నొకటి తరుముతూ చేసిన కలస్వనం లాగ మనోహరంగా వుంది. నిజంగా ఆనాడు బ్రహ్మానందం జీవితానికి తొలిసారిగా బ్రహ్మానందమైంది!

మధుర స్మృతులు జీవుణ్ణి బరువెక్కిస్తాయి కాబోలు; అడుగులు మందకొడిగా పడుతున్నాయి... "ఆలోచనలకేం— అప్పుడే పన్నెండు దాటిపోయినట్టుంది. త్వరగా నడవాలి!" నిశ్చయించుకున్నాడు. జోరుగా నడవనారంభించాడు. ఆలోచనల నరికట్టేందుకు యత్నించాడు. అయినా బుద్ధి వాడుచెప్పు చేతుల్లో లేకుండా పోతోంది నడక మాత్రం వేగంగానే సాగిస్తున్నాడు.

ఎట్టకేలకు చినమామయ్యగారింటికి చేరుకునే సరికి మధ్యాహ్నం రెండుగంటలు దాటింది. ఇంట్లో కొందరు పని

మనుషులు గోడలకి వెల్లవేస్తున్నారు. కాని తన కెందుకో వెలవెల లాడుతున్నట్లనిపించింది. చిన్నత్త ఒక్కర్తే వుంది. ఎదురుగా వచ్చింది. "ఇంటిదగ్గరున్నంచేనా?" అంది, జవాబిచ్చాడు చిల్లో బొల్లోమంటూ ఉత్సాహంగా వుండే చిన్నత్త ముభావంగా వుంది. ఎందువల్లనో చాలముక్తసరిగా క్షేమ సమాచారం ప్రశ్నించింది. అడక్కుండానే అవీ ఇవీ చెప్పే తనలోనైతం ఆ వాతావరణంలో ఉత్సాహం తగ్గిపోయింది. అర్ధమౌనంగా జవాబు లిచ్చాడు.

"స్నానం చెయ్యాలా?...భోజనానికి లేస్తావా?" అంది చిన్నత్త. తాను స్నానం చేస్తానన్నాడు. ఆమె తువ్వాలు వగైరా లిచ్చింది. స్నానంచేసి మామయ్యపంచ మడతపెట్టి కట్టుకున్నాడు. "వడ్డించాను రాబాబూ!" అంది చిన్నత్త. వెళ్ళి పీటమీద కూర్చున్నాడు. పరధ్యాన్నంగా నాలుగు మూలలా వెదికాడు. ఇంట్లో ఎక్కడా సుమిత్రి అలికిడి వినిపించడంలేదు. ఆమెగురించి భోగట్టా అడగాలనిపించింది. ఆ అవకాశ మివ్వడం లేదామె. భోజన పదార్థాల వడ్డనగురించి తప్పితే మరోమాటలేదు. ఆమె వంటిల్లోకి వెళ్ళినపుడు నాలుగు మూలలకి దొంగచూపులు ప్రసరింపచేస్తూనే వున్నాడు. పాము చెవులతో సుమిత్రి కోసం గాలిస్తూనే వున్నాడు. అత్త గాజులు మోతా, అప్పుడప్పుడు మ్రోగే కంఠధ్వనీ, పెరట్లో పనివాళ్ళ రొదా తప్పిస్తే—అంతా నిశ్శబ్దంగానే వుంది.

ఏదో అసంతృప్తిగా ఆకలి తీర్చుకుని బైటకు వచ్చాడు ఆలోచిస్తూ, నిశ్శబ్దంగా, వాకిట్లో వాలుకుర్చీలో చాలాసేపు కూర్చున్నాడు..."చిన్న మామయ్య ఏడీ అత్తా?" ప్రశ్నించాడు. బహుశా చినమామయ్యతో కలిసి సుమిత్ర ఏవూరైనా వెళ్ళిందేమో తెల్సుకుందామని. తీరా విన్న సమాచారం సంతృప్తి కలిగించలేదు.

"ఇంతకీ సుమిత్ర ఎక్కడికి వెళ్ళినట్లు?" అడుగుదామని తిరిగి చూసేసరికి చిన్నత్త అక్కడ కనిపించలేదు. ఎందుకనో ఆమె తనతో సంభాషణ తప్పించుకొంటున్నట్లు తోచింది. ఎలాగో ముళ్ళమీదున్నట్లు సాయంత్రం వరకూ గడిపాడు.

గోధూళి వేళయింది. వీధి అరుగుమీద కూర్చున్నాడు. వచ్చేపోయే జనాన్ని చూస్తున్నాడు. దూరంనుంచి జట్కా వస్తోంది. అందులో ఎవరో ఒక స్త్రీ ఒక పురుషుడు కూర్చున్నారు. "ఆఁ...అదిగో సుమిత్రే! ...మామయ్యతో కలసి వస్తోంది!" అనుకున్నాడు. చిరునవ్వు ముఖంతో జట్కాను పట్టిపట్టి పరిశీలించాడు. జట్కావచ్చింది. వాళ్ళయిల్లు దాటివెళ్ళిపోయింది. ఆగలేదు. బ్రహ్మానందం మనస్సు చివుక్కుమని పోయింది.

సూర్యుడు అస్తమించాడు. లోకంలోని ఆశలన్నీ తోడుకొని వెళ్ళిపోయాడు. క్రమంగా మసగ వెలుగులుకూడా మాసిపోతున్నాయి. సరిగ్గా అదేసమయానికి వీధిమళుపులో

సైకిలుమీద ఎవరో వస్తూన్నట్టు తోచింది. చూశాడు. పరీక్షించాడు. చిన్నమామయ్యే! ఇంటిగుమ్మంలో ఆగాడు సైకిలు దిగాడు. కొంచం సంశయంగా, "ఎవరదీ...ఆనందమా?... ఇంటి దగ్గర్నుంచే నేమిటార్రి?" అన్నాడు.

చేతిలో ఏదో కాగితం ప్యాకెట్టువుంది. సైకిలు లోపల పెట్టేశాడు. చేతిలోని కట్ట టేబిలు మీద పెట్టాడు. అత్త దీపాలు వెలిగించింది...ఎంతో సంతోషంగా తనని పలకరించే వారు మామయ్య. ఎంతో ఆప్యాయంగా ఆర్ద్రింగా వుండే వాడు. పేరుకు తగ్గట్టుగా తమ తండ్రిగారి పోలికవచ్చిందని మురిసిపోయేవాడు. అలాంటిది ఎందుకంత ముభావం? తనతో మాట్లాడ్డం యిష్టంలేదన్నట్లుగా ముక్తసరిగా ప్రశ్నించేసరికి మనసు కుంచుకుపోయింది వాడికి. చొక్కావిప్పి పాగా కొయ్యకి తగిలిస్తూ, "స్నానంచేసి వస్తానురా?" అన్నాడు. లోపలికి వెళ్లిపోయాడు. అత్త అనుసరించింది.

టేబిలుమీదున్న ప్యాకెట్టు తీశాడు బ్రహ్మానందం. అటూయిటూ త్రిప్పిచూశాడు. ఒకపత్రిక — శుభలేఖ అంటించి వుంది. లైటు పెద్దదిచేసి చదివాడు. గుండె ఆగిపోయినట్లనిపించింది. 'సదాశివరావు వారియు శుభలేఖార్థములు' అన్న వాక్యం చదివేసరికే కన్నులు చీకట్లు క్రమ్మాయి! ఇంకేముంది? తన సుమిత్రికే వివాహం. కాని తన పేరుండవలసిన స్థానాన్ని దురాక్రమణ చేసినవాడు ఎవడో దశరథరామయ్యట! బుర్ర తిరిగిపోతున్నట్లు తోచింది వాడికి.

చిన్నత్తా మామయ్యా పెరట్లో నుంచి ఇంకా రాలేదు!

వీధిలోకి నడిచాడు బ్రహ్మానందం. ఇంక యింట్లో ఉండటం వాడికి సుతరామూ శక్యంకాలేదు. వీధిలోకి వెళ్లిన వాడు, మళ్ళీ వెనక్కు-యినా చూడలేదు. అలాగే, ఆలోచనా రహితంగా, ప్రాణంలేని కళేబరంలా, కీయిస్తే, నడిచే ఆట కారులాగ, కేవలం విధిచేతిలో కీలుబొమ్మలాగ— రాజవీధిలో నడక సాగించాడు.

అత్తయ్యతోటీ మామయ్యతోటీ కడసారిగా చెప్పనైనా చెప్పలేదు!

"ఛీ...వెధవ బ్రతుకు! దురదృష్టవంతుణ్ని బాగుచేసే వాళ్ళు లేరంటారు... ఇదే, కాబోలు!" అనుకున్నాడు. 'ఇంతకీ సుమిత్ర ఏమైనట్లు తనలోనే బహిరంగంగా ప్రశ్నించుకున్నాడు. 'బహుశా వాళ్ళ మేనమామలు తీసుకువెళ్లారేమో!' ఏకాంతంగా జవాబు చెప్పుకున్నాడు. బజారు కాఫీహోటల్ రేడియో గొంతెత్తి పాడుతోంది— "నీకోసమే...బ్రతుకు నీకోసమే..." అని "ఆపాడుతున్నది ఎవరో?... సుమిత్ర కాదుకదా!' సందేహించాడు బ్రహ్మానందం. సుమిత్ర ఎందుకు పాడుతుంది? తన వెర్రిగాని, పాడినా తనకోసమై ఎందుకు పాడుతుంది? 'ఛీ... కృతఘ్నురాలు!' అనుకున్నాడు కోపంగా...మళ్ళీ తన్నితనే మందలించుకున్నాడు. 'ఛా-పాపం ఆమెనని ఏంలాభం?... ఇంత గారాంగాను పెంచి, ఆఖరికి

దాని కిష్టంలేని పెళ్ళి చేస్తున్నాడు చినమామయ్య! దుర్మార్గుడు... ఎంత మంచిగా కనిపించినా, సమయం వచ్చేసరికి తేలిపోతారు!...ఎంత కిరాతకంగా తయారవుతారో మానసిక కులాయంనుంచి ఆలోచనలు బయల్దేరాయి. రెపరెపలాడుతూ రెక్కలు కొట్టుకుంటున్నాయి. దూరదిగంతాలలోకి విలీనమవుతున్నాయి!

చీకట్లు నిండిన పాతాళంలా నోరు తెరచుకొని తననే కబళించ జూస్తోంది నిరాశ! కాని బ్రహ్మానందానికి ఆశ పూర్తిగా పోలేదు. తాను మామయ్య యింటికి వెళ్ళాలి. చిన్నతనంనుంచీ తనకి పెళ్ళాంగా పుట్టిందని లోకమంతా చెప్పిన సుమిత్రను ఎలాగైనా సాధించాలి. ఈ అన్యాయాన్ని ప్రతిఘటించాలి నిశ్చయంగా సంకల్పించుకొన్నాడు బ్రహ్మానందం.

కనుకనే పాపం— భయంకరమైన ఆనాటిచీకట్లనుంచి— హాయిగా కలకలలాడే, పాటలుపాడే, సువాసనల చిమ్మే— రేవులకోసం తలపోస్తూ నిశ్శంకగా అడుగులు సారిస్తూ... నిర్భయంగా నడచివెళ్ళిపోతున్నాడు బ్రహ్మానందం!

★

[విజయవాడ ఆకాశవాణి సౌజన్యంతో— 21-7-59]